క్లుప్తంగా

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

నరసాపురం: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం గురువారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్ సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బస్సులకు సంబంధించి, కార్గో సేవలకు సంబంధించి ఫిర్యాదులు, సూచనలు ఉదయం 11 గంటలు నుంచి 12 గంటలు వరకూ 99592 25486 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

133 కేవీ విద్యుత్ స్టేషన్ పరిశీలన

పెనుగొండ: ఎన్నో ఏళ్లుగా అప్రోచ్ రహదారి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పెనుగొండలోని 133 కేవీ విద్యుత్ స్టేషన్‌ను ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. గతంలో ఉన్న బైపాస్ రహదారి మూసి వేయడంతో అప్రోచ్ రహదారి లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ తరుణంలో ఎమ్మెల్యే పితాని దృష్టికి విద్యుత్ శాఖాధికారులు తీసుకువెళ్లగా పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. విద్యుత్ సమస్యలు రాకుండా ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి, ట్రాన్స్‌కో ఎస్సీ ఎ.రఘునాథ్ బాబు, నరసాపురం ఈఈ కె.మధుకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా కనకదుర్గమ్మ జాతర ఉత్సవాలు



అమ్మవారి ఘటాలకు హారతులిస్తున్న భక్తులు

యలమంచిలి: ఉగాది సందర్భంగా అడవిపాలెం గ్రామంలో నిర్వహించే గ్రామ దేవత కనకదుర్గమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆసాదులు అమ్మవారి ఘటాలను తలపై ఎత్తుకుని మంగళవాయిద్యాల నడుమ భక్తుల చెంతకు వెళుతున్నారు. తమ ఇళ్లకు వచ్చిన ఘటాలకు భక్తులు పసుపు నీళ్లతో అమ్మవారి పాదాలు కడిగి, కొబ్బరికాయలు, అరటిపళ్ల నైవేద్యం సమర్పిస్తున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీను, పొట్టుపోతు నాగ లక్ష్మణ శ్రీనివాసరావు, అడబాల రాజేష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

వైవీ సుబ్బారెడ్డికి పెండ్ర వీరన్న పరామర్శ



వైవీ సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న పెండ్ర వీరన్న

నరసాపురం రూరల్: రాజ్యసభ సభ్యుడు, టీటీడీ బోర్డు మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తల్లి యర్రం పిచ్చమ్మ (85) ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ సీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్ర వీరన్న బాపట్ల జిల్లా మేదరమెట్ల గ్రామానికి వెళ్లి సుబ్బారెడ్డి మాతృమూర్తికి నివాళులర్పించారు. పెద్ద కుమారుడైన వైవీ సుబ్బారెడ్డిని కలిసి సంతాపం వ్యక్తం చేశారు.

కౌలురైతు చట్ట ముసాయిదాను వెంటనే ఆమోదించాలి

పెనుగొండ: రాష్ట్ర ప్రభుత్వమే కౌలురైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇచ్చేలా తీసుకొచ్చిన నూతన కౌలురైతుల చట్టం ముసాయిదాను ఈ అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఆచంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించి, తహశీల్దార్ జి.కనకరాజు కి వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీగా ఇచ్చిన భూయజమానుల సంతకంతో సంబధం లేకుండా కౌలురైతులకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు కేతా పూర్ణారావు, కౌలురైతులు కె.సత్యనారాయణ, బండి రంగారావు, కేతా మోహన్ రావు, బండి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మానవజాతి మనుగడకు మొక్కల పెంపకమే ఆధారం

యలమంచిలి: మానవజాతి మనుగడకు మొక్కల పెంపకమే ఆధారమని నరసాపురం రెవిన్యూ డివిజనల్ అధికారి దాసి రాజు అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామీకరణ, కాంక్రీట్ రోడ్లు, వాహన కాలుష్యం వల్ల వాతావరణంలో ఉష్ణోగ్రతలు బాగా పెరిగిపోతున్నాయన్నారు. మొక్కల పెంపకం ద్వారా మాత్రమే ఈ సమస్యను పరిష్కరించగలమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ గ్రంధి నాగ వెంకట పవన్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ పూడి డేవిడ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

కలగా మత్స్యకార కల్యాణ మండపం

- అమలుకు నోచుకోని గత ప్రభుత్వ నిర్ణయం
- నిరుపయోగంగానే మోడల్ ఫిష్‌మార్కెట్ భవనం



నిరుపయోగంగా ఉన్న మోడల్ ఫిష్ మార్కెట్ భవనం

నరసాపురం: నరసాపురం పట్టణంలో పార్కురోడ్డులో ఉన్న మోడల్ ఫిష్ మార్కెట్ భవనం మళ్లీ నిరుపయోగంగా మారింది. ఈ మోడల్ ఫిష్‌మార్కెట్ భవనాన్ని మత్స్యకార కల్యాణమండపం ఏర్పాటు చేయాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి బ్రేకులు పడ్డాయి. మత్స్యకారులకు ఎప్పటి నుంచో కలగా ఉన్న కల్యాణమండపం అందుబాటులోకి వచ్చే అవకాశాల దారులు దాదాపుగా మూసుకుపోయాయి. నియోజకవర్గంలో పెద్దసంఖ్యలో ఉన్న మత్స్యకారులకు స్థానికంగా ఇప్పటి వరకూ ప్రత్యేకంగా ఓ కల్యాణ మండపం లేదు నరసాపురం నియోజకవర్గంలో 90 వేల వరకూ మత్స్యకార జనాభా ఉంది. నరసాపురం మున్సిపాలిటీలో కూడా పెద్ద సంఖ్యంలో మత్స్యకార జనాభా ఉంది. అయితే పట్టణంలో మిగిలిన కొన్ని సామాజిక తరగతుల వారికి సంబంధించి ప్రత్యేక కల్యాణ మండపాలు ఉన్నాయి. మత్స్యకారులు తమకు కల్యాణ మడపం నిర్మించాలని, స్థలం ఇచ్చినా తాము ఫంక్షన్స్ చేసుకోవాడానికి ఓ వేదిక ఏర్పాటు చేసుకుంటామని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రయత్నం

పార్కు రోడ్డులో 2007లో మోడల్ ఫిష్ మార్కెట్ భవనాన్ని రూ.17 లక్షలతో నిర్మించారు. అయితే వ్యాపారాలకు అనువుగా ఉండే ప్రాంతం కాదని ఆ భవనంలోకి మత్స్యకారులు రాలేదు. దీంతో మోడల్ ఫిష్ మార్కెట్ భవనం అప్పటి నుంచి ఖాళీగా, నిరుపయోగంగా ఉంది. దీంతో మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆ భవనాన్ని మత్స్యకార కల్యాణమండపంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. అప్పటి మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజును తీసుకొచ్చి, కల్యాణమండపంగా మార్చడానికి రూ.30 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ప్రభుత్వం మారిన తరువాత ఈ ప్రతిపాదన మరుగున పడింది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వ నాయకులు స్పందించి నిరుపయోగంగా ఉన్న మోడల్ ఫిష్ మార్కెట్ భవనాన్ని మత్స్యకార కల్యాణ మండపంగా మార్చాలని మత్స్యకారులు డిమాండ్ చేస్తున్నారు.

మత్స్యకార కల్యాణ మండపం కట్టి తీరాలి



మోడల్ ఫిష్ మార్కెట్ స్థలం మునిసిపాలిటీదే. మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అప్పటి మంత్రి సిదిరి అప్పలరాజును మార్కెట్ భవనం వద్దకు తీసుకొచ్చి, నిరుపయోగంగా ఉన్న భవనాన్ని ఆధునీకీకరించి మత్స్యకార కల్యాణ మండపంగా తీర్చిదిద్దాలని కోరారు. వెంటనే ఆయన అంగీకరించి నిధులు మంజూరు చేశారు. నరసాపురంలో మత్స్యకార సోదరులు అధికసంఖ్యలో ఉన్నారు. నిరుపయోగంగా ఉన్న మోడల్ ఫిష్‌మార్కెట్ భవనాన్ని కల్యాణమండపంగా మార్చాలి.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

ఎంపీటీసీలను కలిసిన ఎంపీపీ అభ్యర్థి



ఎంపీపీ అభ్యర్థి వినుకొండ ధనలక్ష్మికి మద్దతు తెలుపుతున్న ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ

యలమంచిలి: ఈ నెల 27న ఎంపీపీ ఎన్నిక జరుగుతున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ ఎంపీపీ అభ్యర్థి వినుకొండ ధనలక్ష్మీ బుధవారం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. 2021లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీపీ స్థానాన్ని వైఎస్సార్ సీపీ గెలుచుకుంది. ఆ పార్టీకి చెందిన యలమంచిలి ఎంపీటీసీ సభ్యురాలు రావూరి వెంకటరమణ, ఏనుగువానిలంక ఎంపీటీసీ వినుకొండ ధనలక్ష్మీ ఎంపీపీ స్థానాన్ని చెరొక రెండున్నరేళ్ల పంచుకోవాలని ఒప్పందం చేసుకున్నారు. ఒప్పందం మేరకు ముందు రెండున్నరేళ్లు ఎంపీపీగా పని చేసిన రావూరి వెంకటరమణ గతేడాది మార్చి నెలలో రాజీనామా చేశారు. అనంతరం ఎలక్షన్ కోడ్ రావడం, ప్రభుత్వం మారడంతో అప్పటి నుంచి ఎంపీపీ ఎన్నిక జరగలేదు. ఈ నేపథ్యంలో రావూరి వెంకటరమణ ఎంపీపీగా ఉన్న సమయంలో కనకాయలంక ఎంపీటీసీ సభ్యుడు గొల్లపల్లి శ్రీనివాసరావు వైస్ ఎంపీపీ–1గా ఉన్నారు. దీంతో ఈ ఏడాది జనవరి 21న గొల్లపల్లి శ్రీనివాసరావును ఇన్‌చార్జి ఎంపీపీగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడంతో జనవరి 24న ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం ఈ నెల 27 ఎంపీపీ ఎన్నికకు ఉత్తర్వులు జారీ చేయడంతో వైఎస్సార్ సీపీ ఎంపీపీ అభ్యర్థి వినుకొండ ధనలక్ష్మీ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులను కలిసి మద్దతు కోరారు. యలమంచిలి మండలంలో 18 ఎంపీటీసీ స్థానాలు ఉండగా కట్టుపాలెం ఎంపీటీసీ స్థానం ఖాళీగా ఉంది. మిగిలిన 17లో 13 మంది వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు కాగా, ముగ్గురు తెలుగుదేశం, ఒక జనసేన ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

వలంటీర్లకు ఏది భరోసా?



జయసరితను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాలకొల్లు సెంట్రల్: వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారికి ఉద్యోగ భద్రత కల్పించిన వెంటనే మంత్రి నిమ్మల రామానాయుడు కోరినట్లు చించినాడ పూతరేకులు, జున్నులతో పాటు కాకినాడ కాజాలు కూడా అందజేస్తారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం జనరల్ సెక్రటరీ కర్రా జయ సరిత గుర్తుచేశారు. బుధవారం వైఎస్సార్ సిపి కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జయసరిత మాట్లాడుతూ ఎన్నికల ముందు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని చెప్పి హామి ఇచ్చి నేడు కనీసం వలంటీర్ల ఊసే ఎత్తడంలేదని విమర్శించారు. బుడమేరు వరదల్లో వలంటీర్లను ఎక్కడున్నారో? వెతికి వారిని ఎలా ఉపయోగించుకుని బాధితులకు సేవలందించారో రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. కోవిడ్ సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి సేవలందించారన్నారు. అటువంటి వ్యవస్థను నేడు నిర్వీర్యం చేయాలని చూడడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికల్లో మాత్రం స్థానిక మంత్రి నిమ్మల రామానాయుడు వలంటీర్లకు రూ. 5 వేలు సరిపోదు రూ. 10 వేలు ఇస్తామని హామి ఇచ్చిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్లుగా పాపం వలంటీర్లు రూ. 10 వేలు వస్తాయని ఎంతో ఆశగా ఎదురుచూశారని కాని గత పది నెలలుగా ఇచ్చే రూ. 5 వేలు కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెచ్చెట్టి కృష్ణాజి, జోగాడ ఉమామహేశ్వరరావు, జోగి వెంకటేశ్వరరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, వడ్లపాటి సురేష్, దేవ రాజేష్, గంగిరెడ్ల ప్రసాద్, వీరా మల్లిఖార్జునరావు, బుంగా జయరాజు, మధు, హేమలత, కుమారి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆగని వాహన చోరీలు



పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పురపాలక సంఘ కార్యాలయంలో వాహనాలు చోరీకి గురవుతున్నాయి. పురపాలక కార్యాలయంలో సాధారణంగా వాహనాలు ఎక్కువగా పార్క్ చేస్తూ ఉంటారు. అయితే సమావేశాలు జరిగే సందర్భంలో సందట్లో సడేమియాగా వాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఇప్పటి వరకూ మునిసిపల్ కార్యాలయంలో నాలుగు వాహనాలు చోరీకి గురైనట్లు కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. కార్యాలయంలో జరిగే సమావేశాలకు వచ్చే నాయకులు, విలేకరుల, కార్యాలయంలో పనిమీద వచ్చే జనం వాహనాలు ఇప్పటి వరకూ నలుగురు వ్యక్తులవి చోరీకి గురయ్యాయి. నాలుగు రోజులు క్రితం కార్యాలయంలో జరిగిన పట్టణ ప్రణాళిక విభాగం భాగస్వామ్య సమావేశంలో ఓ నాయకుడి వాహనం పోయింది. ఇటీవల మునిసిపల్ కార్యాలయంలో చోరీ చేసిన ద్విచక్రవాహనాన్ని బ్యాంక్ వీధిలో కోటక్ మహీంద్ర బ్యాంక్ పక్క సందులో పెట్టి అక్కడ నుండి మరో వాహనాన్ని చోరీ చేసి అది తీసుకువచ్చి మునిసిపల్ కార్యాలయంలో పెట్టినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఆ వాహనదారుడు వెతుక్కుంటూ ఇక్కడకు రాగా ఇతను వెతుక్కుంటూ అక్కడకు వెళ్లి తమ వాహనాలను తెచ్చుకున్నారు. కార్యాలయం ప్రాంగణంలో ఉన్న సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో చోరీకి గురవుతున్న వాహనాలను గుర్తించలేకపోతున్నారు. అధికారులు స్పందించి ముందుగా కార్యాలయంలో సీసీ కెమెరాలు మరమ్మతులు చేయించాలని జనం కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన



ఆచంట: పెదపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు



పాలకొల్లు సెంట్రల్: నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

పెనుగొండ: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం బిల్లు తీసుకురావాడన్ని వ్యతిరేకిస్తూ ఆచంట పెదపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ఆచంట పెదపేటలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాలమహానాడు సీనియర్ నేతలు బీరా మధు, సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ప్రతిసారీ మాల మాదిగల మధ్య వర్గకరణ చిచ్చుపెట్టి పబ్బంగడుపుతున్నారని ఆరోపించారు. భవిష్యత్‌లో ఆచంట మండల స్థాయిలో మాల సంఘాల జేఏసీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమం లోమాల మహానాడు నాయకులు ఉల్లం రామానుజం, దబ్బా ప్రకాష్, అంద్రు లక్ష్మణ్ నక్కా ప్రియా, మట్టా చంటి, కారేం చినబాబు, పారుపల్లి సురేష్, బొంతు శ్రీను పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: తప్పుల తడకతో కూడిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌ను రద్దు చేసి హైకోర్టు జడ్జీలతో త్రిసభ్య కమిటీ వేసి న్యాయ విచారణ చేయాలని రాష్ట్ర పీవీ రావు మాలమహానాడు అధ్యక్షుడు గుమ్మాపు సూర్యవరప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక గాంధీబొమ్మల సెంటర్‌లో పీవీ రావు మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు దళితులపై చిత్తశుద్ధి ఉంటే ప్రస్తుతం ఉన్న 15 శాతం రిజర్వేషన్‌లను కంటిన్యూ చేసి మాదిగలకు అదనంగా 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. ఏప్రిల్ 10న జాతీయ అధ్యక్షుడు పండు అశోక్ పిలుపు మేరకు పెద్దఎత్తున కాకినాడలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి అసెంబ్లీ ముట్టడికి శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో కొప్రపాటి వీరాస్వామి, ఇంజేటి కుమార్, చేరుగొండి పద్మకిషోర్, బుంగా జయరాజు, దేవా రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లోడు పెంపునకు రాయితీ



యలమంచిలి విద్యుత్ సబ్ స్టేషన్

యలమంచిలి: ప్రస్తుతం ప్రతి ఇంటిలో ఏసీ, ఫ్రిజ్, వాషింగ్ మిషన్ వాడకం సామాన్యమైపోయింది. దీంతో ప్రస్తుతం ఇంటికి వస్తున్న విద్యుత్ సరిపోక తరచూ విద్యుత్ ట్రిప్ అవుతుంది. ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి విద్యుత్ అధికారులు వినియోగదారులకు వెసులుబాటు కల్పించారు. విద్యుత్ కిలో వాట్స్ పెంచుకోవడానికి 50 శాతం రాయితీ కల్పించారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. జూన్ 30 వరకు ఈ అవకాశం కల్పించారు. అలా కాకుండా గడువు ముగిసిన తరువాత అధికారులే వచ్చి తనిఖీ నిర్వహిస్తే పూర్తి మొత్తం చెల్లించాల్సి వస్తుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. కొన్ని దశాబ్దాల క్రితం విద్యుత్ కనెక్షన్ ఉన్న ఇంటిలో ఎక్కువగా ఒక బల్బు, ఒకటి అరా ఫ్యాన్ వినియోగంలో ఉండేవి. ప్రస్తుతం విద్యుత్ పరికరాల వినియోగం పెరిగిపోవడంతో వాడకం ఎక్కువైంది. గత పది సంవత్సరాలతో పోల్చితే విద్యుత్ వాడకం ఇప్పుడు మూడింతలు పెరిగింది. దీంతో నాణ్యమైన విద్యుత్ అందుతున్న దాఖలాలు కనిపించడం లేదు. ఫ్యాన్ల స్థానంలో ఏసీలు పెరిగిపోయాయి. వేడి నీటికి హీటర్లు, దుస్తులు ఉతికేందుకు వాషింగ్ మెషీన్లు, పిండి రుబ్బడానికి గ్రైండర్లు సర్వసాధారణమయ్యాయి. మోటారు సైకిళ్లు, కార్లు సైతం విద్యుత్ ద్వారా చార్జింగ్ చేసుకుంటున్నారు.

లో–ఓల్టేజీ సమస్యలు దూరం

ఈ నేపథ్యంలో వినియోగించే విద్యుత్‌ను క్రమబద్ధీకరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం గృహ విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణకు దాదాపు సగం రాయితీ కల్పిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. గృహ విద్యుత్ అవసరాలకు కనెక్షన్ ఇచ్చే సమయంలో వాడే లైట్లు, గృహోపకరణాల అవసరాలను అంచనా వేసి కిలో వాట్ల లెక్కన డెవలప్‌మెంట్ చార్జీ, సెక్యూరిటీ డిపాజిట్ కట్టించుకునే వారు. దాని కంటే ఎక్కువే వినియోగదారుల వాడకం పెరిగింది. అధికంగా విద్యుత్ పరికరాలు వాడకం వల్ల తక్కువ లోడు కోసం ఏర్పాటు చేసిన పరివర్తకాలు తరుచూ ట్రిప్ అయి లో–ఓల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. వినియోగదారులు కూడా తరుచూ ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి లోడు పెంచుకోవడమే ఉత్తమమైన మార్గమని అధికారులు సూచిస్తున్నారు.

క్రమబద్ధీకరణకు ఇచ్చే రాయితీ వివరాలు

అదనపు లోడు	అసలు ధర (కిలోవాట్‌లో)	తగ్గింపు ధర (కిలోవాట్‌లో)
1	రూ. 2250	రూ.1250
2	రూ.4450	రూ. 2450
3	రూ. 6650	రూ. 3650
4	రూ. 8850	రూ.4450

సద్వినియోగం చేసుకోవాలి



విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. లోడు క్రమబద్ధీకరణ చేసుకోవడం మంచిది. అన్ని విధాలుగా వినియోగదారులకు మేలు జరుగుతుంది. జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఉంది. తద్వారా లోవోల్టేజీ సమస్య నుంచి విముక్తి పొందొచ్చు.

– దున్న రాజీవ్, ఎలక్ట్రికల్ ఏఈ, యలమంచిలి

24న వనుములమ్మ, కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

పెనుమంట్ర: మండలంలోని నెగ్గిపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని పెనుగొండ మార్టేరు రోడ్డులో ఉన్న శ్రీవనుములమ్మ, శ్రీకనకదుర్గమ్మ అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణ ఆరో వార్షికోత్సవాన్ని ఈ నెల 24న నిర్వహిస్తున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మాజీ సర్పంచ్ అల్లంభాస్కరరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. అదేరోజు ఉదయం 5 గంటల నుంచి వైదిక కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం ఆలయ ఆవరణలో ప్రత్యంగేర సహిత చండీహోమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామని, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

పదో తరగతి పరీక్షలకు పది మంది గైర్హాజరు

పెనుగొండ: పదో తరగతి పరీక్షల్లో బుధవారం హిందీ పరీక్షకు పెనుగొండ మండలంలో 10 మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖాధికారి రామకృష్ణ తెలిపారు. మండలంలో ఆరు పరీక్షా కేంద్రాల్లో 989 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 979 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడానికి గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించాలి



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలను పోత్సహిస్తున్న స్వర్ణాంధ్ర యాజమాన్యం అభినందనీయమైనదని ఆర్టీసీ డీఎం సుబ్బన్నరెడ్డి అన్నారు. బుధవారం స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 25వ తేదీ నుంచి కళాశాలలోని ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులతో పాటు అధ్యాపకులకు ఆటల పోటీలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో భాగంగా 2024–2025 సంవత్సరానికి జెఎన్‌టీయూకె సౌత్‌జోన్ పోటీల్లో బాస్కెట్‌బాల్ పోటీల్లో గెలుపొందిన కె.రవితేజారెడ్డి, డి.సునీత (టేబుల్‌టెన్నిస్), డి.భీమేశ్వర్ (ఫుట్‌బాల్) కె.సంతోష్ (కరాటే) లను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కోశాధికారి కేవీ స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, పాలకవర్గ సభ్యులు ఎంవీ రామచంద్రరావు, ప్రిన్సిపాల్స్ డాక్టర్ సురేష్‌కుమార్, పండరీనాథ్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

యలమంచిలి: మండలంలోని కనకాయలంక, పెదలంక గ్రామాలలో బుధవారం పశు సంవర్ధక శాఖ అధికారులు పశు వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో పశు వైద్య సిబ్బంది 85 ఆవులు, 243 గేదెలకు గాలి కుంటు వ్యాధి (గాళ్ల వ్యాధి) రాకుండా టీకాలు వేశారు. యలమంచిలిలంక, లక్ష్మీపాలెం గ్రామాలలో గురువారం ఈ శిబిరాలు నిర్వహిస్తామని మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పాడి రైతులంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.